పొగమంచు

సీరియల్

ముద్దా సురేష్

(పదమూడవ భాగం)

తర్వాత—.... వెల్లకిలా పడివున్న ఓ మానవాకారన్ని దాటుకుంటూ అడుగులేసాడు రాణా.

అది ఆడో, మగో, చచ్చిందో, బ్రతికిందో, రాణా ఆగి చూడలేదు.

చచ్చిపోయిన మరో కుక్క మృతదేహాన్ని తింటున్న ఓ కుక్కను చూసి గాభరాగా దాటాడు రాణా.

ఆ శునకం ఒక్క క్షణం తలపైకెత్తి లోలోపల మొరుగుతూ సూటిగా చూసింది రాణావైపు, నోరుసాచి చొంగలు కార్తుండగా.

ఆ శునకం అతనిమీద తిరగబడలేదు.

కాని తదేకంగా చూస్తుండిపోయింది అతను తిరిగి పొగమంచులో మాయమయ్యేంతవరకూ.

ఊపిరి పీల్చడం కష్టమౌతోంది రాణాకి.

కల్మషమైన గాలిపీల్చడంవల్లనో, లేక తను చూసిన దుర్భర సన్నివేశాలవల్లనో—అర్థంకాలేదు అతనికి.

మరో అరగంట గడిచిన తర్వాత యెదురుగా వున్న బైకుల్లా బ్రిడ్జి చూసి, రాణా కళ్ళు మెరిసాయి.

ఆయాసంతో రొప్పుతూ కళ్ళు చిట్లించి ముందుకు చూసాడు.

తనకోసం ప్రభుత్వం పంపిన వాహనం ఏదీ?

వంతెన యెక్కి నడవసాగాడు రాణా, పొగమంచు లోంచి-వాహనం ఆకారం కోసం ఎదురుచూస్తూ.

అకస్మాత్తుగా అతని ఎదురుగా రెండు హెడ్ లైట్స్ వెల్గాయ్, పొగమంచుని ఛేదించుకుంటూ.

నీడలా కనబడుతూ విచిత్రంగా వున్నది ఓ వాన్.

రాణా సంతృప్తిగా నిట్టూర్చాడు.

అదే తనకోసం ఎదురుచూస్తున్న మిలటరీ వాన్!

ఇంజన్ హోరు వినిపించింది రాణాకి.

మరుక్షణం అది అతనివైపు దూసుకుంటూ వచ్చింది.... కాని, అది అతని చుట్టూ ఓ రౌండ్ కొట్టి, రెట్టింపైన వేగంతో తిరిగి వెనక్కి దూసుకుపోయింది.

విషయం అర్థమైంది రాణాకి.

అతని కడుపులో ఎవరో కెలికినట్లయింది.

వాన్ అందుకోవాలని, దానివైపు గుంపులుగా వస్తున్న పిచ్చివాళ్ళను అది పర్వతంలా ఢీకొంది.

కొన్ని దేహాలు బరువైన ఆ వాహనం కింద పడి నలిగి పోయాయి.

మరికొన్ని శరీరాలు, ఆ తాకిడికి రబ్బరు బొమ్మల్లా అటూ ఇటూ, విసురుగా ఎగిరిపడ్డాయి.

వాన్ రివర్స్ అయి, రాణావద్దకు వేగంగా వచ్చి సడన్ బ్రేక్‌తో రక్కున ఆగింది.

కుడివైపు వున్న చిన్న తలుపు తెర్చుకుని-లోపల్నుంచి గరగర శబ్దం వినిపించింది.

"సారీసర్! వాళ్ళకంటే మీరు చాల ముఖ్యం. అలా చేయక తప్పలేదు. లేకపోతే మీరు వాన్‌లో ప్రవేశించడం దుర్లభమయ్యేది. ప్లీజ్ గెటిన్-మనకి టైంలేదు."

నడుం బాగా వంచి, ఆ యిరుకైన ఖాళీలోంచి, ఎలాగో ఆ టాంకులాంటి వాహనం లోపలకి ప్రవేశించ గలిగాడు రాణా.

డ్రైవింగ్ సీట్లో వున్న వ్యక్తికేసి తేరిపార జూశాడు రాణా.

అతని ఆకారం విచిత్రంగా వుంది.

మరమనిషిలా వున్నాడతను—సురక్షిత లోహపు దుస్తులతో, తలకు పెద్ద హెల్మెట్‌తో.

హెల్మెట్‌కి ఎటాచ్ చేయబడుంది ముఖం మీద మాస్క్. ఆ వ్యక్తి కళ్ళు స్పష్టంగా కనబడలేదు రాణాకి.

నోటివద్దవున్న మౌత్ పీస్‌లోంచి గరగర వినబడింది అతని కంఠం. "క్లోజ్ ది డోర్ సర్! ఆ పిచ్చివాళ్ళలో ఎవరో—ఒకరుగాని, యింకా మరి కొంత పొగమంచు గాని లోపలికి ప్రవేశించడం మనకు మంచిదికాదు."

అతను చెప్పినట్లుగాచేసి, ఆ ఆకారంవైపు తిరిగాడు రాణా.

"నన్ను ఎక్కడికి తీసుకెళ్తున్నావ్?" అడిగాడు.

"మీరే చూస్తారు," జవాబు వొచ్చింది "నా పేరు డోగ్రా. మనం కరచాలనం చేసుకునే అవకాశం లేదు. ఈ గ్లవ్స్ అలాంటివి. మీ గురించి నేను చాల వర్రీ అయ్యేను. యుగాలతరబడి వేచి ఉన్నట్లనిపించింది."

"దార్లో చాల ప్రమాదాలు ఎదురైనాయ్" అన్నాడు పొడిగా రాణా అలసటగా సీట్లో వెనక్కి జారబడుతూ, "మనం ఎటువైపు వెళ్ళాలి?"

"ఒక్క క్షణం సర్! మిమ్మల్ని పికప్ చేసుకున్నట్లు వాళ్ళకి మెస్సేజ్ పంపాలి."

డోగ్రా—ఎదురుగా వున్న ఓ స్విచ్‌నొక్కి, హాండ్ స్పీకర్ లాంటి అవసరంలేకుండా—మాట్లాడాడు.

తన 'మిషన్' యింతవరకూ, నిర్విఘ్నంగా కొనసాగిందనీ, వెంటనే 'బేస్'కి వస్తున్నామనీ రిపోర్టు చేసాడు.

పని పూర్తిచేసి వెనక్కి తిరిగాడు.

"సర్! ఇఫ్ యు డోంట్ థింక్ అదర్ వైజ్...."

మిమ్మల్ని డ్రైవ్ చేయవల్సిందిగా కోరుతున్నాను. ఇలాంటి వెహికిల్స్ నిజానికి దట్టమైన పొగమంచులో ప్రయాణించడానికి వీలుగా వుండవు. కాబిన్ లోపల ఉన్న చిన్న చిన్న రంధ్రాలనుబట్టి ఆ విషయం మీరు గ్రహించి వుండాలి. ఈ సూటువల్ల నాకు డ్రైవ్ చేయడం మరీ యిబ్బంది. ఈ స్పాట్ చేరుకోడానికి నాకు చాలా సేపు పట్టింది అప్పుడు - మాస్క్ హెల్మెట్ ధరించకుండా డ్రైవ్ చేసినాసరే. మళ్ళీ యిప్పుడు హెల్మెట్ తీసి డ్రైవ్ చేయడం నాకు ప్రమాదకరం,తలుపు తీసినపుడు కొంత విష మేఘం లోపలికి ప్రవేశించి ఉంటుంది కాబట్టి.

"ఈ సూటు సీసంతో చేసిందేనా?"

"ఎస్—సర్! అందుకే కదలడానికి యింత యిబ్బందిగా వుంది. రేడియేషన్ నుండి ప్రొటెక్షన్ కోసం ధరించాల్సి వచ్చింది. మొత్తం వాన్ కంతటికీ ఈ ప్రొటెక్షన్ ఉంది."

"రేడియేషన్?"

"అవును. దీన్ని డివాస్టేషన్ వెహికిల్ అంటాం. చాల శక్తివంతమైనది. త్వరలో మీకా వివరాలు తెలుస్తాయి."

అటూ ఇటూ చూసాడు రాణా.

రకరకాల యంత్ర పరికరాలు, సాధనలు, మీటలు ఉన్నాయి చుట్టూ.

"దీన్ని డ్రైవ్ చేయడం నాకు చేతకావొద్దూ?"

"ఓహ్! ఆ యంత్రాల్ని చూసి మీరు భయపడకండి. వాహనం నడవడానికీ, దానికీ ఏం సంబంధంలేదు. నిజానికి మిగతా కార్లకన్నా దీన్ని నడపడం ఈజీ! మొత్తం అంతా ఎలక్ట్రిసిటీమీద నడుస్తుంది. ఒక పెడలు నొక్కితే

ఆగుతుంది. అంతే! కమాన్ సర్. మీ కోసం చాలమంది ఆత్రుతగా యెదురు చూస్తున్నారు."

* * *

రాణా, డోగ్రా సూచనలు పాటిస్తూ ఆ ప్రత్యేక వాహనాన్ని నావల్ భవనాలకు ఎడం ప్రక్కగా తిప్పాడు.

వాన్ కొద్దిసేపట్లో ఓ పెద్ద కార్ల షెడ్ లాంటి దాంట్లోకి నడిచింది.

లోపల అంతా చీకటిగా వుంది.

హెడ్ లైట్ల వెలుతురులో ముందుకు పోనిచ్చాడు రాణా.

రెండు క్షణాల్లో....

ఎదురుగా ఓ బలిష్టమైన కాంక్రీట్ గోడ అడ్డంగా ప్రత్యక్షమైంది.

డోగ్రా, ఓ స్విచ్ నొక్కి కొన్ని పదాలు ఉచ్చరించసాగాడు, అర్థంకాని భాషలో.

ఆ మాటలు కోడ్ లో వున్నాయని గ్రహించాడు రాణా.

ఉన్నట్లుండి గోడ హఠాత్తుగా సీలింగ్ లోకి పైకి లేచింది.

వెనక, వెడల్పాటి వరండా.

డోగ్రా, రాణా చేతిమీద చేయివేశాడు. అతని హెల్మెట్ తల ఊగింది.

రాణా వాన్ని ముందుకి ఉరికించి, లోపల ఆపాడు.

వెనువెంటనే 'వెనుక' గోడ సర్రున క్రిందికి దిగి, యథాప్రకారం ద్వారం మూసుకుపోయింది.

ఒక్క నిముషంపాటు ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు.

ఎదురుగా గోడ అకస్మాత్తుగా పైకిలేచింది.

ఈసారి ఎదురుగా ప్రత్యక్షమైనది డిమ్‌లైట్ల వెలుగులో ఉన్న కారిడార్.

అప్పుడే తెరుచుకొన్న ఆ బూడిదరంగు గోడ, సుమారు పదెనిమిది అంగుళాల వెడల్పులో వున్న బలిష్టమైన లోహపు గోడగా గుర్తించాడు రాణా.

కారిడార్ మెల్లగా పల్లంలోకి దిగుతున్నట్లు గ్రహించాడు రాణా.

మరో రెండు గుమ్మాలు దాటింతర్వాత వాన్ బ్రహ్మాండమైన ఓ వెడల్పాటి హాల్లో ప్రవేశించింది.

పావుమైలు ప్రయాణించిన తర్వాత తాము ఆ ప్రదేశం చేరుకోగలిగామని అంచనా వేసుకున్నాడు రాణా.

అచ్చం తాము ప్రయాణించిన వాన్‌లాగే వున్న మరో వాన్ ఓ వారగా పార్క్ చేయబడి వుండడం గమనించాడు రాణా.

అప్పటిదాకా ఎదురుచూస్తున్న బూడిదరంగు సూట్లలోని వ్యక్తుల గుంపు ముందుకు కదిలింది చేతుల్లోని స్ప్రే(SPRAY) గన్‌లతో.

మరుక్షణం, వారి చేతుల్లోని స్ప్రే గన్‌లనుండి స్పష్టంగా కనబడిన ద్రవం—ఆ రెండు వాహనాల మీదా సర్రున చిమ్మసాగింది.

"ఒక్క క్షణం కదలకుండా కూర్చోవాలిసర్" చెప్పాడు డోగ్రా "మొదట టన్నెల్ ప్రవేశించగానే మనం "డీ—కంటామినేట్" చేయబడ్డాం. అంటే మననుండి యితరులకు ఎట్టి అంటువ్యాధి సోకే ప్రమాదం లేదన్నమాట. వెహికిలుపై యిప్పుడు వారు చేసేది మరో ముందు జాగ్రత్త చర్య. యింకా జాగ్రత్తకోసం మూడోసారి—

మనల్ని స్ప్రే చేస్తారు బయటికి వెళ్ళేముందు."

"వాట్ డజ్ దట్ మీన్?" అన్నాడు రాణా కన్‌ఫ్యూజ్ అవుతూ.

"ఈ భూగర్భ రహస్య స్థావరం మొత్తం స్టెరైలు చేయబడింది. అంటే ఈ ఏరియాలో వొక్క సూక్ష్మ క్రిమి కూడా వుండదు! లోపలికి ప్రవేశించే ప్రతి వ్యక్తినీ, ప్రతి వస్తువునీ, పరిశుభ్రం చేస్తారు, అంటువ్యాధి సోకించే ప్రమాదం లేకుండా. ఈ అధునాతన స్థావరంలో మూడు వందలమంది వ్యక్తులు పది సంవత్సరాలదాకా క్షేమంగా నివసించవొచ్చు.

భూగర్భంలో యిరుకుగా దాన్ని నిర్మించడంవల్ల ఏ సూక్ష్మక్రిమి లోపల ప్రవేశించినా, అది దావానలంలా వ్యాపించే ప్రమాదం వుంది. అందుకే ఈ ప్రికాషనరీ మెసర్స్."

రాణా ఆశ్చర్యంగా అతనివేపు చూసేడు. "పదేళ్ళేమిటి? జస్టు వాట్ ది హెల్ ఈజ్ దిస్ ప్లేస్?"

"....ఐ థాట్ యూ న్యూ దట్....మీకు చెప్పారనుకున్నాను వాళ్ళు."

నెమ్మదిగా, తల అడ్డంగా ఊపాడు రాణా.

"ప్రభుత్వానికి యిది ఫాలౌట్ (FALL OUT) షెల్టర్‌లాంటిది. ప్రపంచ దేశాలన్నీ అణుబాంబుల నిర్మాణానికి అర్రులు చాస్తున్న విషయం మీకు తెలుసు. చైనానుంచి ఈ ప్రమాదం ఇండియాకుంది. ఈమధ్య అరబ్ దేశాలు పాకిస్తాన్‌ను ప్రోత్సహించి 'ఇస్లామిక్ బాంబ్'ను తయారు చేయడానికి పురిగొల్పుతున్నాయ్, అరి కసహాయం ఆశ చూపుతూ. ఈ విధంగా ఎప్పటికైనా భారతదేశం, శత్రువులనుండి ఈ ప్రేలుడు ప్రమాదాన్ని

ఎమరోక్క వల్సివస్తే యిక్కడ ఆశ్రయం తీసుకుంటారు, ప్రభుత్వంలోని ముఖ్యమైన వ్యక్తులు. అరవై అయిదో సంవత్సరంలో ఈ అండర్ గ్రౌండ్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ ప్రారంభమైంది. యింకా మార్పులు, చేర్పులు జరుగుతున్నాయ్. యిక్కడ్నుంచి అసెంబ్లీ భవనానికి రహస్య సొరంగ మార్గం ఉంది."

రాణా నవ్వాడు అదోలా, "యిలాంటివేమైనా ఇంకా ఉన్నాయా? ఐ మీన్.... సాధారణ ప్రజలకోసం."

"ముఝే నహీ మాలూమ్ సర్. యిలాంటి విషయాలు రహస్యంగా వుంటాయి. మహారాష్ట్రలో యిలాంటి స్థావరం మరోటిలేనట్లు మాత్రం నాకు తెలుసు. ఢిల్లీలో వొకటుంది. యింకా ముఖ్యమైన నగరాల్లో యిలాంటి అండర్ గ్రౌండ్ షెల్టర్స్ నిర్మించబోతున్నట్లు చూచాయగా తెలుసు."

"కానీ యివన్నీ ప్రత్యేక వ్యక్తుల రక్షణకే. అవునా?"

"అరవై కోట్ల ప్రజలందరికీ సరిపోయేలా ఈ స్థావరాలు నిర్మించడం అసంభవం! కాదంటారా?"

రాణా బలంగా నిట్టూర్పు వదిలాడు. "నిజమే. కాని నువ్వు స్పెషల్ వ్యక్తిగా యిందులో ప్రవేశార్హత ఎలా సంపాదించగలిగావ్, అన్నదే నా అనుమానం."

డోగ్రా టాపిక్ మార్చాడు. "మనం యిక బైటికి వెళ్లాలి, సర్!"

కొంతసేపటికి, నీలిరంగు గ్వాలియర్ సూటుమీద ఎర్రని నెక్‌టై ధరించిన ఓ యువకుడు ప్రత్యక్షమై రాణాని కారిడార్లగుండా ముందుకు నడిపించసాగాడు.

అతను ప్రశాంత గంభీర స్వరంతో రాత్రి ఏమి జరిగిందో, ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటో, నేర్పుగా

స్పష్టంగా వివరిస్తున్నాడు రాణాకి నడుస్తూ.

అతని మాటల ప్రకారం....

ప్రధాన మంత్రి అక్కడే వున్నారు, చాలమంది కేంద్రమంత్రులతో సహా. ప్రమాద ప్రాంతానికి దూరంగా ఉండకుండా ఆయన ప్రత్యేకశ్రద్ధ తీసుకుని బొంబాయి లోని సురక్షిత స్థావరంనుండి ఆదేశాలు జారీ చేస్తున్నారు.

ఆ అండర్ గ్రౌండ్ భవనంలో ప్రపంచం నలుమూలలకూ మాట్లాడడాన్కి వసతులున్నాయి.

ప్రత్యేక యంత్రాలతో కూడిన వార్ రూమ్ (War Room) కూడా వుంది అక్కడ.

దానికి ప్రత్యేక విద్యుచ్ఛక్తి సప్లయి వుంది. ప్రత్యేక టెలిఫోన్ ఎక్స్చేంజి ఉంది. (రాణాకిప్పుడు అర్థమైంది వాళ్ళు విష మేఘంలో చిక్కుకోకుండా తనని ఎలా కాంటాక్టు చేయగలిగారో)

ఆర్మీ యిప్పుడు బొంబాయి పొలిమేరల్లో ఉన్నది, ఆదేశాలకోసం ఎదురుచూస్తూ.

కాని చాలమంది ప్రధాన సైన్యాధికారులు రహస్య స్థావరంలోనే ఉన్నారు — ప్రధానమంత్రి రూపొందిస్తున్న కార్యాచరణ పథకాలకు సలహాలిస్తూ—

ప్రొఫెసర్ అశ్వత్థామ అక్కడే వున్నాడు వేగంగా పెరిగిపోతున్న విష మేఘం మీద కొత్త సిద్ధాంతాలు యితర సైంటిస్టులతో కలిసి పరిశోధిస్తూ.

డాక్టర్ జులేఖా కూడా అక్కడేవుంది చాలామంది విష మేఘం బాధితులకు ట్రీట్ మెంట్ యిస్తూ—

యిద్దరూ కారిడార్లగుండా నడుస్తుండగా, రాణా చాలామంది తెలుసున్న ముఖాలను గుర్తుపట్టాడు.

అక్కడున్న వారిలో చాలామంది ధనవంతులు, (కొందరు సినీనటులు కూడా) కావడంతో రాణా మస్తిష్కంలో రకరకాల అనుమానాలు పొడసూపాయి.

వాళ్ళు ఈ రక్షణ స్థావరంలోకి ప్రవేశించి విషమేఘం బారినుండి ప్రాణాలు కాపాడుకోవడానికి డబ్బు వెదజల్లారా?

లేక ప్రభుత్వ అధికారులకు కొన్ని విధాలుగా యింతకుముందు సహాయపడి—యిప్పుడు ఈ విధంగా ప్రతిఫలం తీసుకుంటున్నారా!

ఆ ప్రతిఫలం—ప్రపంచాంతం రోజున ప్రాణాల్ని రక్షించుకోవడమే.

చాలమంది—

స్త్రీలు, పురుషులు....

దిగ్భ్రమగా కారిడార్లలో చతికిలబడివున్నారు, పాలిపోయిన ముఖాలతో .... కొందరు స్త్రీలు కన్నీటి ధారలతో....

వారిలో చాలమంది—ప్రక్కగా నడుచుకుంటూ పోతున్న రాణావైపు—ఆసక్తిగా చూడలేదు.

కొందరు మాత్రం—స్నేహితుణ్ని లేదా బంధువుని గుర్తించడాని కన్నట్లు తాపత్రయంగా అతనివేపు చూసారు.

మరికొందరు—రాణావైపు అసూయగా చూసారు. ఆ వ్యక్తి ఏదో ఘనకార్యం సాధించడాన్కి వెళ్తున్నట్లు తమకు ఆ పరిస్థితిలో గుర్తింపు లేనందుకు .... జెలసీ ఫీలవుతూ....

"సరైన సమయంలో యింతమందిని యిక్కడికెలా చేర్చగలిగారు?" అడిగాడు రాణా, ప్రక్కగా నడుస్తున్న

నీలిరంగు సూటు వ్యక్తిని.

“ఒక నిర్ణయం ప్రకారం” పదునుగా వచ్చింది జవాబు.

“ఏమిటా నిర్ణయం?”

“మొత్తం బొంబాయి నగరంలోని జనాభానంతటినీ ఆదుకోడం అసాధ్యం. అలా ప్రయత్నించినా రెస్క్యూ ఆపరేషన్‌కి విఘాతం కలిగే అవకాశం వుంది, ప్రజల్లో చెలరేగిన భయాందోళనవల్ల. దీనివల్ల కొంతమంది ముఖ్యమైన వ్యక్తుల్ని....”

రాణా తటాలున నీలం సూటు వ్యక్తిని ఆపేశాడు చేయిపట్టుకుని. “యు మీన్ దె డిడింట్ ట్రై? అమాయకంగా నిద్రపోతున్న ప్రజలని విష మేఘ రాక్షసికి వదిలిపెట్టి....”

“ఆఫ్‌కోర్స్ దె ట్రైడ్!” విసురుగా అన్నాడు ఆ యువకుడు. “కాని వాళ్ళు కామన్ సెన్స్ ఉపయోగించారు. మూడోవంతు సైనిక బలగం—ప్రజల్ని హెచ్చరించి ఈ సురక్షిత స్థావరాన్ని తరలించడాన్కి కృషి చేసింది. మిగతా బలగం అది చేయగలిగినంతా చేసింది. వేలాది మంది ట్రక్కుల్లో బొంబాయి చుట్టుప్రక్కల ప్రాంతానికి పారిపోయి ప్రాణాలు రక్షించుకున్నారు ఆర్మీవల్లే. బట్ బొంబే ఈజ్ ఎ బిగ్ ప్లేస్ యు నో. కామన్ సెన్స్‌తో ఆలోచించాలి” చెయ్యి విదిలించుకుని, ముందుకి నడిచాడు ఆ యువకుడు.

నోరు తెర్చుకుని నిలబడ్డ రాణా, రెండు క్షణాల తర్వాత కోలుకుని, అతన్ని అనుసరించాడు.

ఎవరపనుల్లో, వారు నిమగ్నులై వున్న మేధావులతో, అధికారులతో, కిటకిటలాడుతున్న ఓ పెద్ద హాలువద్దకు నడిచారిద్దరూ.

రకరకాల ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్స్‌తో, లైటింగ్‌తో వెలుగుతూ గోడలకున్న మ్యాప్‌లతో, టెలివిజన్ తెరలతో నింపబడి హడావుడిగా ఉందా స్థలం, ప్రపంచ యుద్ధాన్కి సన్నద్ధమౌతున్నట్లు.

అండర్ గ్రౌండ్ పైన జరుగుతున్న సర్వనాశనం వాళ్లెవరూ పూర్తిగా అర్థంచేసుకోలేరు అనుకున్నాడు రాణా.

ఆ మారణహోమం ప్రపంచంలో జరుగుతున్నట్లుగా వుంది. టెలివిజన్ తెరలు బూడిదరంగులో శూన్యంగా ఉన్నాయ్.

ఈపాటికి పట్టణమంతా అలుముకున్న ఉన్మాద తీవ్రత హత్యాకాండ, ఆత్మహత్యాకాండ—యివేమీ వాళ్ళు అర్థంచేసుకోలేరు.

వాళ్ళంతా షాక్ అయివుండొచ్చు. నిజమే.

కాని తీవ్రమైన ఆందోళన, దుఃఖం వారి ముఖాల్లో కనబడటంలేదు.

దాంట్లో వారి తప్పేమీలేదు.

జరిగిన దారుణాలు—అసాధారణ సంఘటనలు.

ప్రపంచంలో మునుపెన్నడూ జరగనివి.

మాహిమ్ దుర్ఘటన గురించి వారికి తెలుసు.

ఎయిర్ క్రాష్ సంఘటన వారికి తెలుసు.

కాని జరిగిన సత్యాన్ని వారి అంతరాత్మలు ఎలా వొప్పుకోగలవు?

తానొక్కడు మాత్రమే పరిస్థితి తీవ్రతను 'పూర్తిగా' అర్థంచేసుకోగలడు....నమ్మగలడు.

జరిగిన దారుణానికి మొట్టమొదటి సాక్షి తనే కాబట్టి.

చాల దురదృష్టకరమైన, భయంకరమైన పరిస్థితుల్ని తాను అనుభవించడం జరిగింది కాబట్టి.

"దిస్ వే, మిస్టర్ రాణా!" నీలం సూటు వ్యక్తి కంఠం, రాణా ఆలోచనల్ని భగ్నం చేసింది.

రాణా సాయుధుడైన సైనికుడు కాపలాకాస్తున్న గుమ్మంముందు నిల్చొని వున్నాడు.

ప్రశ్నార్థకంగా చూస్తూ లోపలికి ప్రవేశించాడు రాణా.

"యిదే ప్లానింగ్ హాల్" చెప్పాడు నీలం సూటు వ్యక్తి. "ప్రధానమంత్రి యిప్పుడు స్వయంగా నీతో మాట్లాడతారు."

* * *

స్పెషల్ వాన్‌ని తిరిగి భూగర్భ రహస్య స్థావరం లోంచి బైటికిపోనిచ్చాడు రాణా.

వాహనం మళ్ళీ బొంబాయి వీధుల్లో, పొగమంచు లోంచి దారిచేసుకుంటూ ప్రయాణిస్తోంది.

"సర్!" డోగ్రా రాణా భుజంమీద చేయివేసి పిల్చాడు. "మనం 'అక్కడికి' చేరుకున్నాక మీరే నాకు సహాయపడాలి. ఈ మాస్కుతో, హెల్మెట్‌తో, ఈ రకం దుస్తులతో నేను ఫ్రీగా కదల్లేను. కళ్ళు అక్కడ అస్సలు కనబడవ్" అన్నాడు ఆందోళనగా.

"మునుపటంత దట్టంగాలేదు యిప్పుడు పొగమంచు" వ్యాఖ్యానించాడు రాణా.

"నిజమే. విష మేఘం పలచబడుతోంది ప్రక్కలకు ప్రయాణిస్తూ. కాని విష మేఘంలో యింకా చెప్పుకో దగిన కదలికలేదని రిపోర్ట్సు చెబుతున్నాయ్. లుక్ సర్, మనం అక్కడ ఎక్కువసేపు విష మేఘంలో వుండాల్సిన అవుసరం లేదు. నిముషంలో ఆ విష మేఘం శాంపిల్‌ని మన కంటైనర్స్ పీల్చుకుంటాయి. మనం తిరిగి వెంటనే

ఈ స్పెషల్ వాన్ ఎక్కివచ్చేయొచ్చు. ఈ మాస్క్ ఉంటే నాకు కళ్ళు స్పష్టంగా కనబడవు. అలాగని, ధరించకపోతే నాకు ప్రమాదం. అందుకే నా భాగం డ్యూటీ నేను చేయడంలో మీ తోడ్పాటు కావాలి."

యిప్పుడు రాణా భుజంక్రింద రహస్యంగా వున్న హోల్‌స్టర్‌లో ఓ పిస్తోలు వుంది.

ప్రధానమంత్రి ఆర్డర్స్ ప్రకారం రాణా తన ప్రాణం కాపాడుకోడంకోసం ఎవరినైనా, చివరికి అతని సహచరుడు డోగ్రాని కూడా కాల్చి చంపొచ్చు—కాదు ఖచ్చితంగా కాల్చి చంపాలి—నిర్దాక్షిణ్యంగా—అతని వల్ల రాణాకి ప్రమాదమేర్పడితే. భారత ప్రధానమంత్రి—రాణాలు సమావేశమైనపుడు ప్రొఫెసర్ అశ్వత్థామ కూడా ఆ మీటింగ్‌లో పాల్గొన్నాడు.

ప్రమాదం పెద్దదౌతోందని ఆందోళన చెందాడు అశ్వత్థామ.

బొంబాయి ఇండస్ట్రియల్ సిటీ కావడంవల్ల డేంజర్ ఎక్కువైందని వివరించాడు.

మార్పుచేయబడిన మైకోప్లాస్మా—గురించిన కొన్ని 'క్లూ'లు దొరుకుతున్నాయనీ, అయినప్పటికీ దాని శాంపిల్ తీసుకురానిదే పరిశోధన వేగం పుంజుకొనే అవకాశంలేదనీ పెదవి విరిచాడాయన.

భూగర్భ రహస్య స్థావరం నుండి బయటికివచ్చేముందు రాణా, డాక్టర్ జులేఖాను కల్సుకున్నాడు.

ఆమెలో మునుపటి ఉత్సాహంలేదు.

ఆమె అందమైన కళ్ళచుట్టూ నల్లని చారిక లేర్పడాయ్. అలసటగా, నీరసంగా, వాడిన పువ్వులా కనిపించింది జులేఖా.

ఈసారి—తప్పకుండా—యింతటి వినాశాన్కి కారణ భూతమైన—ఆ విష మేఘం మధ్యగావుండే న్యూక్లియస్ నమూనాను చేజిక్కించుకోమని ఆమె రాణా చేతులు పట్టుకొని ప్రార్థించింది.

రాణా ఆమెకు ధైర్యంచెప్పి కదిలాడు. కాని—అతనికి తెలుసు. తను చేయబోయేది 'ప్రయత్నం' మాత్రమేనని.

ఇతరపరిసితులు అనుకూలించనిదే తాను సఫలంకాలేడు.

"మై గాడ్! లుక్ దేర్!"

డోగ్రా పిలుపుకు ఉలిక్కిపడి అటువేపు చూశాడు రాణా.

ఎదురుగా—దూరంగా.

గుట్టలావున్న నాలుగు మోటారుకార్లు భగభగ మండుతున్నాయి....ఆ మంటల చుట్టూ పెద్ద—మనుషులగుంపు చుట్టూ నిలబడివుంది, ఆ దృశ్యాన్ని మౌనంగా పరిశీలిస్తూ.

బయటినుంచి ఒక్కో వ్యక్తి, ఆ గుంపును చీల్చుకొని లోనికి ప్రవేశించి ఆ మంటల్లోకి దూకుతున్నాడు.

ఆ గుంపు పకపక నవ్వుతూ, చప్పట్లు కొడుతూ ఆనందిస్తోంది, ఆ తమాషాను చూసి.

తర్వాత మౌనం—

మరో వ్యక్తి తిరిగి దూకేదాకా.

"మనం ఎలాగైనా వాళ్ళని ఆపాలి!" అర్చాడు రాణా గాభరాగా, ఆ దారుణ దృశ్యంనుండి దృష్టి మరల్చలేకుండా దిగ్భ్రమగా చూస్తూ.

"నో సర్! వుయ్ హేవ్ టు ఒబే ఆర్డర్స్!" కఠినంగా అన్నాడు డోగ్రా "మనం ఏ సంఘటనలోను కలగజేసుకోకూడదు."

రాణాకి వాదించడం నిరుపయోగమని తెలుసు.

డోగ్రా చెప్పింది నిజమే!

తాము తమ కప్పగించబడిన ఎస్సైన్ మెంట్ ని తల్లక్రిందులు చేయకూడదు.

దారిలో ఎదురైన ప్రతి ఉన్మాద చేష్టలోను, కలుగజేసుకొంటే తాము లక్ష్యాన్ని చేరేదెప్పుడు?

“ఆల్ రైట్!” గొణిగాడు రాణా, బరువుగా నిట్టూర్పు విడుస్తూ, “మనం చేయగలిగేదేమీ లేనప్పుడు ఆ దృశ్యాన్కి దూరంగా పోవడం ఉత్తమం.”

డోగ్రా హృదయం తేలిక పడింది.

“చుట్టూ తిరిగి వెళ్దాం” చెప్పాడతను. “వెనక్కి పోనీండి. అక్కడ ఎడమవైపు టర్నింగ్ తిరిగితే లిబర్టీ థియేటర్ తగుల్తుంది. ఆ దారిన వెళ్దాం!”

రాణా వాహనాన్ని రివర్స్ చేసాడు, అప్పుడే వేగంగా దూసుకువస్తున్న ఓ లారీని త్రుటిలో తిప్పించుకుంటూ.

లారీ రివ్వున, మంటలవైపు, మనుషుల గుంపువైపు దూసుకువెళ్ళింది.

రాణా ప్రయాణిస్తున్న వాన్—సౌండ్ ప్రూఫ్ అయినా బయట శబ్దాలు గ్రహించడాన్కి వాన్ పైటి భాగంలో అమర్చబడ్డ ‘రిసీవర్ల’ ద్వారా వినిపించింది—భడాలున పెద్ద చప్పుడు!

“గుడ్ గాడ్!” గాభరాగా అన్నాడు డోగ్రా, “దిసీజ్ టెర్రిబుల్!”

“యిది ప్రారంభం మాత్రమే,” చెప్పాడు రాణా, “ముందు ముందు పరిస్థితి యింకా విషమం ఔతుంది.”

రాణా అన్నట్లుగానే పరిస్థితి విషయమైంది. నిలు

వునా తగలబడుతున్న భవనాల్ని దాటుకుంటూ వారు ప్రయాణించారు యింకా, అక్కడక్కడ మండుతున్న కార్లను తప్పించుకుంటూ.

పిచ్చివాళ్ళ బృందాల్ని దాటుకుంటూ, పై అంతస్థుల్లోంచి చూసుతున్న మనుషులు,

ఆక్రందనలు—

నవ్వులు—కేకలు....

వికటాట్టహాసాలు....

మూలుగులు....

దాటుకుంటూ

అకస్మాత్తుగా రాణా నడుపుతున్న స్పెషల్ వాన్‌కి అడ్డంపడింది నీలంరంగు దుస్తులు ధరించిన ఓ కార్మికుల గుంపు—

"మై గాడ్! వీళ్ళంతా గవర్నర్ రోడ్డులోని పేపర్ ఫాక్టరీ కార్మికులై ఉండాలి" అన్నాడు డోగ్రా.

"అవును. వీళ్ళంతా నైట్ డ్యూటీ చేసివుండాలి.... అన్నట్లు....వీళ్ళకు, ప్రభుత్వ హెచ్చరిక అందలేదా?" అన్నాడు ఆశ్చర్యంగా రాణా.

డోగ్రా భుజాలెగరేశాడు, "మనం వీళ్ళమధ్యనుంచి డ్రైవ్ చేసుకుంటూ పోవాలి!"

అకస్మాత్తుగా వాన్ అటూ ఇటూ ఊగసాగింది.

దబదబ శబ్దం....

"వాళ్ళు వాన్‌ని తలక్రిందులు చేయడాన్కి ప్రయత్నిస్తున్నారు" కేక పెట్టాడు రాణా.

"డ్రైవ్!" అరిచాడు అసహనంగా డోగ్రా—బైటినుంచి వచ్చే శబ్దాన్ని వినిపించే యంత్రాన్ని 'ఆఫ్' చేస్తూ.

మనుషుల్ని ఛేదించుకుంటూ వెళ్ళినప్పుడు బయటి

పొలికేకలు రాణా వినడం డోగ్రాకు యిష్టంలేదు.

తను చేయబోయే పని—దారుణం అని తెలిసినా, తప్పలేదు రాణాకి—బలంగా యాక్సిలేటర్ నొక్కాడు.

వాహనం చెంగున ముందుకు దూకింది.

కార్మికులు ఆ హఠాత్పరిణామానికి అదిరిపడుతూ వెనక్కి తూలిపడ్డారు.

కొంతమంది చక్రాలక్రింద మాయమయ్యారు.

పైకీ, కిందకీ, కుదుపుల్ని బట్టి వాన్ మనుషులమీంచి నడుస్తోందని గ్రహించాడు రాణా.

అయినా పెడల్ మీద బలంగా నొక్కి ఉంచిన కాలిని తీసివేయలేదు.

యింజన్ హోరు ఉధృతమౌతూ, వాన్ వేగం అందుకుంది టాప్ మీదకి చేరుకున్న మనుషుల్ని తూలనాడుతూ.

కోపంగా ముందుకు వస్తున్న ఉన్మాదుల్ని, రబ్బరు బొమ్మల్లా ఎగరగొడుతూ పరిగెట్టించాడు వాహనాన్ని రాణా ముందుకి.

కొంత సేపటికి పరిస్థితి మామూలు స్థితికి వొచ్చింది.

స్టీరింగ్ వీల్ మీద రాణా చేతులు వొణుకుతున్నాయ్.

తను ఎన్ని హత్యలు చేసాడు?

"స్టీరింగ్ నాచేతికివ్వండి. మీరు అలసిపోయారు" అన్నాడు డోగ్రా విషయాన్ని గ్రహిస్తూ.

"నో!" తలవిదిలించాడు రాణా "ఐ విల్ బీ ఆల్ రైట్! కూర్చొని ఆలోచనలతో బుర్ర పాడుచేసుకొనే కన్నా డ్రైవింగ్ చేయడం ఉత్తమం. నీ ఇన్స్ట్రుమెంట్స్ జాగ్రత్తగా చెక్ చేస్తూ వుండు. మనం కరెక్టు డైరెక్షన్‌లో వెళ్తున్నామో లేదో గమనించాల్సిన బాధ్యత నీది."

(ఇంకా వుంది)